క్లుప్తంగా

వైభవంగా అయ్యప్ప పూజలు


అయ్యప్పస్వామికి సుగంధ పుష్పార్చన చేస్తున్న స్వాములు

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డులోని అయ్యప్ప పీఠం వద్ద మంగళవారం పడి పూజ వైభవంగా చేశారు. పలువురు కన్నె స్వాములు అయ్యప్ప ముందు కర్పూరం వెలిగించారు. స్వాములు స్వామికి పలు పుష్పాలతో అభిషేకాలు జరిపారు. అనంతరం భక్తులు ప్రసాదాలు అందించారు.

ముగిసిన నిఘా వారోత్సవాలు

తాటిచెట్లపాలెం: వాల్తేర్ డివిజన్ పరిధిలో వారం రోజులుగా జరుగుతున్న నిఘా అవగాహన వారోత్సవాలు మంగళవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా డివిజన్ పరిధిలో అవినీతి, లంచగొండితనంపై ప్రయాణికులకు అవగాహన కల్పించారు. వారం రోజులుగా ఈ అంశంపై వ్యాసరచన, వక్తృత్వం, డ్రాయింగ్, పెయింటింగ్, డిబేట్ పోటీలు నిర్వహించారు. సీనియర్ డివిజనల్ పర్సనల్ ఆఫీసర్ రంజన్ మహంతి నాయకత్వంలో డివిజనల్ కల్చరల్ అసోసియేషన్ సభ్యులు డివిజనల్ రైల్వే మేనేజర్ కార్యాలయం వద్ద అవినీతి రహిత సమాజంపై అవగాహన కల్పిస్తూ నాటికను ప్రదర్శించారు. బాల్యదశ నుంచే అవినీతి, లంచం వంటి విషయాలపై పిల్లలకు అవగాహన కల్పించాలని రైల్వే అధికారులు సూచించారు.

ఉచితంగా వైద్యసేవలు

ఎంవీపీకాలనీ: శ్రీ సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో మరింత బలోపేతంగా ఉచిత వైద్య సేవలు అందించనున్నట్లు ఆ సంస్థల జిల్లా అధ్యక్షుడు పీఆర్ఎస్ఎన్ నాయుడు వెల్లడించారు. ఇందుకు అనుగుణంగా మరో ముందడుగు పడినట్లు మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఎంవీపీ కాలనీలోని ప్రేమసదన్‌లో 50 మంది సీనియర్ వైద్యులతో ప్రత్యేక ఇంటరాక్టివ్ సెషన్‌ను మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా కమ్యూనిటీ హెల్త్‌కేర్ సహకారాన్ని పెంపొందించాలని నిర్ణయించారు. సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో ప్రత్యేక ఉచిత వైద్యశిబిరాలు, స్పెషలిస్ట్ డాక్టర్ల సేవలు వినియోగం, ఔషధాలు పంపిణీ, రాష్ట్ర వ్యాప్తంగా సేవలు విస్తృతం చేయాలని తీర్మానించారు. అనంతరం శ్రీ సత్యసాయి మొబైల్ వైద్య బృందం అధ్యక్షుడు డాక్టర్ జీవీఎస్ రావు ఈ అంశంపై సమగ్ర నివేదికను అందజేశారు.

శాసనాల అధ్యయనంపై ప్రసంగం

విశాఖ సిటీ: ఆంధ్ర విశ్వవిద్యాలయం హిస్టరీ ఆర్కియాలజీ విభాగం ప్రొఫెసర్ సి.సోమసుందర్ రావు శాసనాల అధ్యయనం మీద విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఆర్కియాలజీ-చరిత్ర చదువుతున్న విద్యార్థులకు ఈ సబ్జెక్టు ప్రాముఖ్యతను, ఉపయోగాలను వివరించారు. ఇటీవల ఆయన చరిత్ర, పురాతత్వశాస్త్రంపై రచించిన పుస్తకం రివైజ్డ్ ఎడిషన్‌ను క్లుప్తంగా చర్చించారు. విభాగంపై ఉన్న మక్కువతో 2023-25 బ్యాచ్ విద్యార్థులకు ఈ రివైజ్డ్ ఎడిషన్ పుస్తకాన్ని ఉచితంగా పంపిణీ చేశారు. వయోభారాన్ని సైతం పక్కనపెట్టి విద్యార్థులకు జ్ఞానాన్ని అందించాలని ఆలోచనతో ఆయన స్వయంగా వారికి బోధన చేశారు. ఈ కార్యక్రమంలో విభాగాధిపతి సి.హెచ్.మధుసూదన్ రావు, ఎం.రమేష్ బాబు, బి.ఆనంద్, బి.రాజా, సాయి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

ఎంవీపీకాలనీ: విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో సంఘ్ పరివార్ జనవరిలో హైందవ శంఖారావం పేరిట బహిరంగ సభను నిర్వహించనుంది. విజయవాడ వేదికగా జనవరి 5వ తేదీన నిర్వహించనున్న ఈ సభ పోస్టర్‌ను మంగళవారం లాసన్స్ బే కాలనీలోని బీజేపీ కార్యాలయంలో మాజీ ఎంపీ జీవీఎల్ నరసింహారావు, ఆయా సంస్థల ప్రతినిధులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బహిరంగ సభ ఏర్పాట్లపై సమీక్షించారు. విశాఖ ప్రాంత బౌద్ధిక్ కొండపల్లి రామారావు, విశ్వహిందూ పరిషత్ నగర ఉపాధ్యక్షుడు అన్నే నారాయణరావు, విశాఖ నగర సంఘ్ చాలాక్ పీవీ నారాయణరావులు సభ ఏర్పాట్లు, నిర్వహించే కార్యక్రమాలను వివరించారు. సనాతన హిందూ దేవాలయాల్లో జరుగుతున్న అపచారాలు, ఆస్తుల అన్యాక్రాంతం, అన్యమత ప్రచారాల నివారణ వంటి అంశాలను అరికట్టే డిమాండ్‌తో సభ జరుగుతుందన్నారు.

అక్రమాల 'ప్లానింగ్'!

- అడ్డగోలు నిర్మాణానికి ఎన్‌వోసీ జారీ
- కూటమి నేతలతో కుమ్మక్కై ప్రభుత్వ స్థలాలు కబ్జా
- ఫిర్యాదుతో అసలు విషయం వెలుగులోకి
- రెవెన్యూ సర్వేతో ప్రభుత్వ స్థలం అని నిర్ధారణ
- తప్పిదాన్ని కప్పిపుచ్చుకోవడానికి ప్లాన్ రద్దు


జ్ఞానాపురంలోని జీవీఎంసీ జోనల్ కార్యాలయం

విశాఖ విద్య: నగరంలో సామాన్యుడు ఇంటి నిర్మాణ అనుమతుల కోసం దరఖాస్తు చేసుకుంటే జీవీఎంసీ అధికారులు సవాలక్ష కొర్రీలు పెడతారు. వాటికి సమాధానం చెప్పడానికి దరఖాస్తుదారులు ప్రదక్షిణ చేయాల్సిందే. అదే కూటమి నాయకుల విషయంలో మాత్రం అధికారులు నిబంధనలకు పాతరేస్తున్నారు. జీవీఎంసీ జోన్-5 పరిధిలోని కరాసలో చోటుచేసుకున్న ఉదంతమే ఇందుకు నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తోంది. కూటమిలోని ఓ కీలక నాయకుడి సిఫార్సుతో టౌన్ ప్లానింగ్ నుంచి అనుమతులు పొందిన వ్యక్తులు బహుళ అంతస్తుల నిర్మాణానికి సిద్ధమయ్యారు. ఇంతలో ఆ స్థలం తమదని మరొకరు తెరపైకి రావడంతో ఇక్కడ జరిగిన అక్రమాల 'ప్లానింగ్' బెడిసికొట్టింది.

ఒకే స్థలానికి ఇద్దరు పోటీ

జీవీఎంసీ 52వ వార్డు పరిధిలోకి వచ్చే న్యూ కరాస పార్కు సమీపంలో సుమారు 150 గజాల స్థలం చాలకాలంగా ఖాళీగా ఉంది. కాలనీ ఏర్పడిన సమయంలో ఆ స్థలాన్ని ప్రజావసరాల కోసం కేటాయించినట్లు అక్కడి ప్రజలు చెబుతున్నారు. అయితే తాము ఆ స్థలాన్ని కొనుగోలు చేశామని ఇటీవల ఓ వ్యక్తి బహుళ అంతస్తుల భవన నిర్మాణం చేపట్టారు. దీని వెనుక కూటమి పార్టీకు చెందిన కీలక నాయకుడు ఉండడంతో అంతా మిన్నకుండిపోయారు. ఈ లోగా ఆ స్థలం తాము కొన్నామని అందుకు సంబంధించిన ధృవీకరణ పత్రాలతో మరో వ్యక్తి ముందుకొచ్చాడు. దీంతో పంచాయతీ ముదిరి ఇరుపక్షాల వారు కోర్టు మెట్లు ఎక్కారు.

ఇంతకీ ఆ స్థలం ఎవరిదో!

కరాసలో స్థల వివాదం చిలికి చిలికి గాలివానలా మారుతుండడంతో జీవీఎంసీ అధికారులు మేల్కొన్నారు. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా భవన నిర్మాణ చేపడుతున్న స్థలంలో రెవెన్యూ అధికారులతో కలసి జీపీఆర్ఎస్ అనుసంధానంతో సమగ్ర సర్వే చేశారు. సర్వే అధికారులు దాన్ని ప్రభుత్వ స్థలంగా ధృవీకరించినట్లు తెలిసింది. దీంతో నాలుక కరుచుకున్న జోన్-5 టౌన్ ప్లానింగ్ అధికారులు భవన నిర్మాణం కోసం ఇచ్చిన ప్లాన్‌ను హడావుడిగా రద్దు చేసినట్లు సమాచారం. అయితే అప్పటికే ఆ భవనం సెల్లార్‌తో పాటు మరో రెండు అంతస్తులు లేపేశారు. ఇప్పుడు భవన నిర్మాణ విషయంలో ఎలా ముందుకెళ్లాలనే దానిపై టౌన్ ప్లానింగ్ అధికారులు తర్జన భర్జన పడుతున్నారు.

వసూళ్ల ప్లానింగ్

జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులకు దండిగా ముట్టజెబితేనే అనుమతులు బయటకు వస్తాయని నిర్మాణ దారులు బాహాటంగానే విమర్శిస్తున్నారు. జోన్ పరిధిలోని వార్డుల్లో పలు చోట్ల తీసుకున్న ప్లాన్‌కు విరుద్ధంగా అపార్ట్‌మెంట్ల నిర్మాణం చేపడుతున్నా అధికారులు అటువైపు కన్నెత్తి చూడడటం లేదనే విమర్శలు ఉన్నాయి. ఏదైనా ఫిర్యాదు వస్తే స్థానిక వార్డు ప్లానింగ్ సెక్రటరీతో నోటీసులు ఇప్పించేసి ఆ సాకుతో మళ్లీ వసూళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ వ్యవహారంలో ఏదైనా తేడా వస్తే తాము బలైపోతున్నామని నిజాయితీగా పనిచేసే వార్డు సెక్రటరీలు వాపోతున్నారు.

అక్రమార్కులపై చర్యలేవి?

ప్రభుత్వ స్థలాలు, జీవీఎంసీ పరిధిలోని పార్కులకు ఆనుకొని ఉన్న విలువైన స్థలాలపై కూటమి నేతల కన్నుపడుతోంది. వీరికి రెవెన్యూ, టౌన్ ప్లానింగ్ అధికారులు సహకరిస్తుండడంతో ఖరీదైన స్థలాలు కబ్జాకు గురవుతున్నాయి. కరాసలో జరిగిన వ్యవహారం ప్రస్తుతం పెద్ద దుమారమే లేపుతోంది. ఈ పరిణామాల నేపథ్యంలోనే టౌన్‌ప్లానింగ్‌లో కీలక అధికారులందరిపై బదిలీ వేటు పడిందని జోనల్ కార్యాలయంలో గుసగుసలాడుకుంటున్నారు. అయితే దీనిపై వివరణ కోసం ప్రయత్నం చేసినా జోనల్ స్థాయి అధికారులు,సిబ్బంది నోరు మెదకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. జిల్లా కలెక్టర్, జీవీఎంసీ కమిషనర్ దృష్టి సారించి నగరంలోని ప్రభుత్వ స్థలాల పరిరక్షణకు చర్యలు చేపట్టాలని ప్రజానీకం కోరుతున్నారు.

మూగజీవాల బెడద

వీధుల్లో సంచరిస్తున్న ఆవులు


పల్లివీధిలో సంచరిస్తున్న మూగజీవాలు


బకెట్‌లో నీరుతాగుతున్న ఆవు

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డులోని పలు ప్రాంతాల్లో పశువుల గోల వదలడం లేదు. ఇవి పగులు,రాత్రి అన్న తేడా లేకుండా వీధుల్లో సంచరిస్తున్నాయి. రోడ్డుకు అడ్డంగా పడుకోవడంతో ఆ మార్గాన వచ్చే వారితో పాటు నివాసీయులు ఇబ్బంది పడుతున్నారు. ఈ సమస్య మల్కాపురం మరిడిమాంబ ఆలయం వెనుక అధికంగా ఉంది. ఇక్కడ పలువురు పశువుల పెంపకం దార్లు ఆవుల నుంచి పాలు సేకరించిన తర్వాత పశువుల శాలలో పెట్టుకోవాలి.కానీ వీరు అలా చేయకుండా విచ్చల విడిగా వదిలేస్తున్నారు.దీంతో అవి వీధుల్లో తిరుగుతూ ఇళ్ల ముందు ఎండబెట్టిన పప్పు దినుసులతో పాటు మంచినీటిని తాగి పాడు చేస్తున్నాయి. మలమూత్ర విసర్జన చేయడంతో మార్గాలు అపరిశుభ్రంగా మారుతున్నాయి. సమస్యపై అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

యువత బాధ్యతాయుతంగా మెలగాలి

విశాఖ సిటీ: యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండి, బాధ్యతాయుతంగా నడుచుకోవాలని మూడో పట్టణ పోలీస్‌స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు సూచించారు. మాదక ద్రవ్యాల నియంత్రణ, సైబర్ నేరాలపై ఆంధ్ర విశ్వవిద్యాలయం విద్యా విభాగం ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. డ్రగ్స్, సైబర్ నేరాలు, ట్రాఫిక్, రహదారి భద్రత తదితర అంశాలపై అవగాహన కల్పించారు. మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాల వినియోగం కారణంగా ఆరోగ్యం పాడవడంతో పాటు, చట్టపరమైన చర్యలకు బాధ్యులుగా నిలవాల్సి వస్తుందని చెప్పారు. వీటి వినియోగంతో పాటు కలిగి ఉండడం, రవాణా చేయడం కూడా చట్టరీత్యా నేరమని స్పష్టం చేశారు. సైబర్ నేరాలు జరగకుండా నిరోధించడంలో యువత ముఖ్య భూమిక పోషించాలని చెప్పారు. హెల్మెట్ ధరించడం, లైసెన్స్ కలిగి ఉండడం వంటి ప్రాథమిక నియమాలను పాటించాలని సూచించారు. రోడ్డు ప్రమాదాలను నివారించడం, నియంత్రించడం అందరి సమన్వయం, సహకారంతోనే సాధ్యపడుతుందన్నారు. యువత రాష్ డ్రైవింగ్ మానుకోవాలని, ఇది వారితో పాటు రహదారిలో ప్రయాణించే ఇతరులకు కూడా ప్రాణాంతకంగా మారుతుందన్నారు.

విద్యార్థి దశలో ఎన్నో సవాళ్లు

విద్యా విభాగాధిపతి ఆచార్య టి. షారోన్ రాజు మాట్లాడుతూ విద్యార్థి దశ ఎన్నో సవాళ్లతో కూడుకున్నదన్నారు. చుట్టూ సమాజంలో అనేక ఆకర్షణలు యువతను పెడదోవ పట్టించే దిశగా నడిపిస్తాయిని, వీటి నుంచి దూరంగా ఉండాలని సూచించారు. జీవితంలో ఉన్నత లక్ష్యాలు, క్రమశిక్షణతో ముందుకు సాగితే అందమైన భవిష్యత్తు సాకారం అవుతుందని వివరించారు. కార్యక్రమంలో విభాగ ఆచార్యులు డాక్టర్ ప్రకాష్, డాక్టర్ సాల్మన్, డాక్టర్ ప్రవీణ, డాక్టర్ రాము, డాక్టర్ మూర్తి, డాక్టర్ హేమలత, డాక్టర్ వినీలకుమారి పాల్గొన్నారు.

చల్లగ చూడు.. నాగన్నా

ఘనంగా నాగుల చవితి


రైల్వేయార్డ్ ప్రాంతంలో నాగేంద్రునికి పూజలు చేస్తున్న భక్తులు

విశాఖ విద్య: నాగుల చవితి పర్వదినం పురస్కరించుకొని భక్తులు నాగదేవతకు ప్రత్యేక పూజలు చేశారు. ఇంటిల్లిపాది పుట్టలో పాలు పోశారు. గోపాలపట్నం మండల పరిధిలోని పలు కాలనీల్లో నాగుల చవితి సందడి కనిపించింది. ఏపీఎస్ఈబీ కాలనీలోని నాగుల చవితి పార్కులో ప్రత్యేక ఏర్పాట్లు చేయడంతో భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకొని పూజలు చేశారు. ఇందిరానగర్, నాగేంద్రనగర్ కాలనీల్లో ప్రత్యేకంగా సిద్ధం చేసిన పుట్టల్లో భక్తులు పాలు పోశారు. నాగదేవతకు భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు.

కంచరపాలెం: జీవీఎంసీ 56,57 వార్డుల్లో నాగుల చవితిని ఘనంగా నిర్వహించారు. రైల్వే లోకోషెడ్ లోకి పండగ సందర్భంగా ప్రజలను అనుమతించారు. దీంతో ఈ ప్రాంతంలో పెద్ద ఎత్తున పండగ జరిగింది. గవర కంచరపాలెం, రామ్మూర్తిపంతుల పేట, పైడిమాంబకాలనీ, దయానందనగర్, ముత్యమాంబకాలనీ, రాజీవ్‌కాలనీ, చాకలిగెడ్డ, డీజిల్ క్వార్టర్స్, దోబీలైన్, శ్యామ్‌నగర్, గోకుల్‌నగర్, గౌరీనగర్, ఐటీఐ జంక్షన్, 104 ఏరియా, బాపూజీనగర్, మర్రిపాలెం ప్రాంతాలకు చెందిన భక్తులు పూజలు నిర్వహించారు.


ఇందిరానగర్‌లో పుట్టలో పాలు పోస్తున్న భక్తులు

భక్తిశ్రద్ధలతో నాగుల చవితి పూజలు

మల్కాపురం: నాగులచవితి పూజలను పారిశ్రామిక వాసులు మంగళవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పలువురు భక్తులు సంప్రదాయ వస్త్రాలు ధరించి నాగేంద్రుడికి ప్రీతి అయిన చిమ్మిలి, అరటి, కొబ్బరి,చెరకు,జామి,పాలు,గుడ్లు,నాగుల తువాలు తీసుకువెళ్లి సమీపంలో పుట్ట వద్ద పూజలు చేశారు.అయితే పారిశ్రామిక నగరం అంతా భవనాలతో నిండిపోవడంతో పుట్టలు కనుమరుగయ్యాయి.దీంతో వారు ఇళ్లకు చేరువలో ఉన్న కొండలు, ఊరికి శివారు ప్రాంతాల్లో పుట్టల వద్దకు వెళ్లి మొక్కులు తీర్చుకున్నారు. నాగదేవ తమకు ఎలాంటి దోషాలు లేకుండా చల్లగా చూడు అని పూజలు చేసి,అక్కడ పుట్ట మన్నును నుదుట పెట్టుకున్నారు.

ఘనంగా నాగుల చవితి

సింథియా: పారిశ్రామిక ప్రాంతంలో నాగుల చవితి పండగను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. భక్తులు పుట్టల్లో పాలు పోసేందుకు ఉదయం నుంచే క్యూ కట్టారు. ముఖ్యంగా షిప్‌యార్డ్‌కాలనీ, సింథియాన్యూకాలనీ, త్రినాథపురం, ఎస్సార్‌కాలనీ, కాకరలోవ, జయేంద్రకాలనీ, యారాడ వేళ్లే మార్గాల్లో ఉన్న పుట్టల్లో ప్రజలు కుటుంబ సమేతంగా పాలు పోశారు.

➡ జీవీఎంసీ 40వ వార్డు షిప్‌యార్డ్‌కాలనీలో 40వ వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు కుటుంబ సమేతంగా పుట్టలో పాలు పోశారు. కార్పొరేటర్ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో పుట్టల వద్దకు వచ్చిన భక్తులకు స్నేక్ సేవర్ సొసైటీ సభ్యులు పాములపై ప్రజలకు అవగాహన కల్పించారు. పర్యావరణానికి మేలు చేసే పాముల జాతులు అంతరించిపోతున్నాయని, పాములు జాతులు అంతరిస్తే ఎదురయ్యే అనర్థాలను ప్రజలకు వివరించారు. పాముల ప్రాముఖ్యతను తెలియజేసి వాటి బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు.

➡ జీవీఎంసీ 62వ వార్డు కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు కుటుంబసమేతంగా పుట్టలో పాలు పోసి నాగేంద్రునికి మొక్కులు తీర్చుకున్నారు.

సందడి

నాగులచవితి సందర్భంగా భక్తులతో భెల్‌టౌన్‌షిప్‌లో సందడి నెలకొంది. అక్కిరెడ్డిపాలెం, నాతయ్యపాలెం, శీలానగర్, వెంకటేశ్వరకాలనీ, హరిజనజగ్గయ్యపాలెం, మింది, రాంనగర్, గుడివాడఅప్పన్నకాలనీ, గాజువాక, రాజీవ్‌నగర్, గిరిప్రసాద్‌నగర్‌కాలనీ, బొజ్జన్నకొండ తదితర ప్రాంతాల నుంచి భెల్ టౌన్ షిప్‌కు భక్తులు తరలివచ్చారు. పుట్టలో పాలు పోసి మొక్కులు చెల్లించుకున్నారు. కార్లు, ఆటోలు, ద్విచక్రవాహనాలు భారీగా రావడంతో ట్రాఫిక్ సమస్య ఎదురైంది.


నాగేంద్ర కాలనీలో పుట్టలో పాలు పోస్తున్న భక్తులు


58వ వార్డు శివారులో పుట్టకు పాలుపోస్తున్న భక్తులు


అచ్చినాయుడులోవ వద్ద పుట్టకు పూజలు చేస్తున్న భక్తులు


కుటుంబ సమేతంగా పుట్ట వద్ద పూజలు చేస్తున్న 62వ వార్డు కార్పొరేటర్ లక్ష్మణరావు


ఏపీఎస్ఈబీ కాలనీలో పుట్ట వద్ద భక్తుల పూజలు


భక్తులతో నిండిపోయిన భెల్ టౌన్ షిప్


పుట్టలో పాలు పోస్తున్న కార్పొరేటర్ నాగేశ్వరరావు

అబ్బురపరిచిన మాక్ డ్రిల్


విపత్తుల నిర్వహణపై అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ శ్రీవల్లి


సునామీ పై మాక్ డ్రిల్ నిర్వహిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

పెదగంట్యాడ: ఎప్పుడు ప్రశాంతంగా ఉండే యారాడ గ్రామంలో మంగళవారం అలజడి రేగింది. పలు శాఖలకు చెందిన అధికారులు, సిబ్బంది చేరుకోవడంతో ఏమి జరగుతుందో అని గ్రామస్తులు ఉలిక్కిపడ్డారు. సమావేశం ఉంది అందరూ రావాలని అధికారులు చెప్పడంతో అందరూ భయాందోళనకు లోనయ్యారు. మరో పక్క అగ్నిమాపక దళ అధికారులు ఎయిర్ బోట్, లైఫ్ జాకెట్స్ తీసుకు రావడంతో గ్రామస్తులకు ఏమీ అర్థం కాక అయోమయంలో పడ్డారు. అంతా వచ్చిన తర్వాత అసలు విషయం చల్లగా చెప్పారు రెవెన్యూ అధికారులు. విపత్తులను ఎలా ఎదుర్కోవాలో అనే అంశంపై అవగాహన కల్పించడానికి వచ్చామని చెప్పారు. విపత్తు నిర్వహణ అథారిటీ (ఏ పీ ఎస్ డీ ఎం ఏ) మేనేజింగ్ డైరెక్టర్ ఆదేశాల ప్రకారం జిల్లా కలెక్టర్ సూచనల మేరకు గాజువాక తహసీల్దార్ శ్రీవల్లి నేతృత్వంలో అటు పోలీసు శాఖ, ఇటు అగ్నిమాపక దళం ,విద్యుత్ శాఖ, వైద్య శాఖాధికారులు విపత్తు నిర్వహణపై అవగాహన కల్పించారు..అగ్నిమాపక సిబ్బంది మాక్ డ్రిల్ నిర్వహించి అబ్బురపరిచారు. ఈ సందర్భంగా తహసీల్దార్ శ్రీవల్లి మాట్లాడుతూ తుపాన్లు, సునామీ వంటివి వచ్చే ముందు వాతావరణ శాఖ అధికారులు ముందుగానే సమాచారం ఇస్తారన్నారు. విపత్తుల సమయంలో ఎవరూ భయపడకుండా జాగ్రత్తలు వహించాలని సూచించారు. అగ్ని ప్రమాదాల బారి నుంచి ఎలా రక్షించుకోవాలో వివరించారు. గ్యాస్ లీక్ అయితే భయపడకుండా ఇంట్లోని అన్ని కిటికీలు తెరచి ఉంచాలని..కరెంట్ స్విచ్‌లు ఆన్ చేయకూడదని చెప్పారు. స్వయంగా ఎలా జాగ్రత్తలు తీసుకోవాలో ప్రమాదం నుంచి బయట పడాలో వారి వద్ద ఉండే తాళ్లు, పాత ట్యూబ్‌లో ఖాళీ వాటర్స్ బాటిల్స్ ఉపయోగించి ఎలా రక్షించుకోవాలో వివరించారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శోభారాణి, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ఆపన్నులకు ఆశ్రయం


వృద్ధుడిని కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న ఏయూటీడీ కార్యదర్శి వాసు


వసతిగృహంలో ఆశ్రయం పొందిన కాకినాడ మహిళ

సీతమ్మధార: ఇంటి నుంచి వచ్చేసిన ఒక వృద్ధుడిని కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఏయూటీడీ సంస్థ తెలిసిన వివరాలిలా ఉన్నాయి. శ్రీకాకుళం జిల్లాకు చెందిన దుప్పల చినబాబు (64) శ్రీకాకుళం నుంచి విశాఖ వచ్చేశారు. రైల్వేస్టేషన్‌లో తిరుగుతుండగా ఆర్‌పీఎఫ్, ఏయూటీడీ సంయుక్త రెస్క్యూ ద్వారా ఆయనను ప్రశ్నించగా హైదరాబాద్ వెళ్తున్నానని చెప్పారు. కాని ఆయన వద్ద ఎటువంటి రైలు టికెట్ లేకపోవడంతో అనుమానం వచ్చిన సిబ్బంది టీఎస్ఆర్ కాంప్లెక్సులో గల నిరాశ్రయుల వసతిగృహానికి తరలించారు. ఈ నేపథ్యంలో అతని కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో వసతిగృహానికి వచ్చిన అతని మనవడికి వృద్ధుడిని అప్పగించారు. ఈ కార్యక్రమంలో ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు, మేనేజర్ జ్యోతిర్మయి, కేర్ టేకర్లు పాల్గొన్నారు.

కాకినాడ మహిళకు ఆశ్రయం..

కాకినాడకు చెందిన ఒక మహిళకు టీఎస్ఆర్ కాంప్లెక్సులో గల నిరాశ్రయుల వసతిగృహంలో ఆశ్రయం కల్పించారు. కాకినాడకు చెందిన వృద్ధురాలు గల్లిమెల్ల పద్మావతి (58)కి ఎవరూ లేరు. ఈమె కాకినాడ నుంచి విశాఖపట్నం వచ్చేసి రైల్వేస్టేషన్ ఫ్లాట్‌ఫాం వద్ద ఉంది. ఆర్‌పీఎఫ్ సిబ్బంది ఏయూటీడీ స్వచ్ఛంద సంస్థకు సమాచారం ఇచ్చారు. కేర్‌టేకర్లు అక్కడికి చేరుకుని సదరు మహిళను ద్వారకానగర్‌లో గల టీఎస్ఆర్ కాంప్లెక్సులోని నిరాశ్రయుల వసతి గృహానికి తరలించారు. ఏయూటీడీ సంస్థ కార్యదర్శి ప్రగడ వాసు పర్యవేక్షణలో మేనేజర్ జ్యోతిర్మయి ఆమెకి మహిళా వసతిగృహంలో ఆశ్రయం కల్పించారు.